# సరదా కథలు

వెంకటేశ్వర్రావ్‌కి చాలా ఆనందంగా ఉంది. తన కొడుకుని తలచుకుంటున్నప్పుడల్లా కించిత్ గర్వం కూడా కలుగుతోంది. లేకపోతే ఎక్కడ నాయనమ్మ పాలెం... ఎక్కడ హైదరాబాదు? తన చేతుల్లో అల్లారుముద్దుగా పెరిగిన బిడ్డడు రెండు నెలల్లో ఊరుకాని ఊరులో ఎంత హాయిగా సెటిలయి పోయాడు!?

నిజమే... గోపాలకృష్ణ ఉద్యోగం చేయనవసరం లేనంత గొప్పింట్లో పుట్టినా, అల్లారుముద్దుగా పెరిగినా మొదట్నించీ కష్టపడి పనిచేసే తత్వం, సొంత భావాలతో వ్యక్తిత్వం గల మనిషిలా తన ప్రత్యేకత నిరూపించుకుంటూనే వస్తున్నాడు.

'మన పొలం పనులూ అవీ చూసుకోడానికి ఏదో టెన్త్ క్లాస్ వరకూ చదివితే చాల్లేరా! అని తనంటే' లేదు నాన్నా ఈ రోజుల్లో డిగ్రీ కనీస విద్యార్హత అయిపోయింది. రెప్పొద్దున్న ఈ ఆస్తుల్ని ఏమాత్రమైనా విస్తరించాలన్నా దానికి కావాల్సిన లోన్లు, అప్లికేషన్లు పెట్టి పెద్దపెద్ద వాళ్ళతో మాట్లాడాలన్న ఆమాత్రం చదువుండాలి నాన్నా— అని తనని ఒప్పించి డిగ్రీ పూర్తిచేశాడు. డిగ్రీ రాస్తూనే సర్వీస్ కమీషన్ పరీక్షలు కూడా రాసి సెక్రటేరియట్‌లో ఉద్యోగం సంపాదించాడు.

"ఏరా... ఈ ఉద్యోగం చెయ్యాలా... తప్పదా" అని తనంటే "తప్పదు నాన్నా... ఈ ఉద్యోగం చేస్తూ మరో చిన్న డిపార్ట్‌మెంటల్ ఎగ్జామ్ కూడా రాసి పాసై పోతే మన ఊరికీ కూడా గుర్తింపు వచ్చేవిధంగా పనిచేసే అవకాశం నాకు కలుగుతుంది" అని రెండు నెలల క్రితం హైదరాబాద్‌కి ప్రయాణం కట్టాడు.

ఒక్కడే వెళ్ళాడు... రూమ్ వెతుక్కున్నాడు. తనే వండుకుంటున్నాడు. తింటున్నాడు. ఉద్యోగానికి వెళ్తున్నాడు. సాయంత్రం పూట చదువుకుంటూ రాయబోయే టెస్ట్‌కి ప్రిపేరవుతున్నాడు. నిజంగా తన కొడుకు కష్టం విలువ తెలిసిన మనిషి..." అనుకున్నాడు వెంకటేశ్వర్రావ్.

అయినా మరీ కష్టపడుతున్నాడేమోనని ఓ మూల బాధలేక పోలేదతనికి. అందుకే రోజూ ఆఫీసుకి నడిచి వెళుతున్నాడని తెలిసి అప్పటికప్పుడు లారీలో ఓ సైకిలు కొని మరీ పంపించాడో నెల క్రితం.

అయినా మనసుండ బట్టక ఎలా ఉన్నాడో చూద్దాం అని భార్యతో సహా హైదరాబాద్ ప్రయాణం కట్టాడు. కొడుకు తీసుకున్న రూమ్ అదీ చూశాడు. చాలా సౌకర్యంగా అన్నీ అమర్చుకున్నాడు గోపాలకృష్ణ.

అంతేకాదు... అక్కడున్న రెండురోజులూ హైదరాబాద్ మొత్తం అంతా చూపించాడు కూడా. అసలు కాలు కిందపెట్ట నీయకుండా ఆటోలోనే తిప్పాడు.

తన ఊళ్ళో చెప్పారు— 'హైదరాబాద్‌లో ఆటో వాళ్ళతో జాగర్త సుమా...! ఊరికి కొత్త అని తెలిసి పోయిందనుకో అంతే అక్కడక్కడే తిప్పితిప్పి తిప్పి తెగ వసూలు చేస్తారు' అని.

కానీ గోపాలకృష్ణ అవన్నీ దగ్గిరుండి తనే స్వయంగా చూసుకున్నాడు. అతి షార్ట్ కట్స్‌లో ఆటోల్ని

## Bad... Bad... Hydera'Bad'

తిప్పాడు. చాలాసార్లు "అలా వెళ్ళొద్దు, మీటరు ఎక్కువ అవుతుంది. ఈ పక్క నుంచి ఇంకోదారి ఉంది... ఇలా తిప్పు" అని ఆటోవాళ్ళని డైరెక్ట్ చేశాడు కూడా.

అదంతా ఓ కంట గమనిస్తూనే ఉన్నాడు వెంకటేశ్వర్రావ్. ప్రతీక్షణం ప్రతీ సంఘటనా తనకు తన కొడుకు మీదగల అభిప్రాయాన్ని మరింతగా పెంచేటట్టుగానే జరిగాయి. అందుకే చాలా ఆనందంగా ఉందతనికి. అదే మాట బార్యతో కూడా చెప్పుకొని పొంగిపోయాడు— ఊరికి చేరుకున్నాక.

అంతటితో ఆగలేదు. సాయంత్రం రచ్చబండ దగ్గిర పెద్దాళ్ళతో ముచ్చటిస్తూ మళ్ళీ తెగమురిసి పోయాడు. అందరూ ఆనందించారు... ఒక్క పెద్దయ్య తప్ప.

"మరోలా అనుకోకు వెంకటేశ్వర్రావ్. నువ్వు చెప్పినవన్నీ వింటుంటే నాకు నీలా అనిపించటం లేదు. ఇంకోలా ఉంది" అన్నాడాయన అందరూ నిష్క్రమించాక.


"అంటే?" అడిగాడు వెంకటేశ్వర్రావ్.

"ఏం లేదు... ఈ వయసులో అలాంటివి సహజమే అనుకో..."

"కొంచెం అర్థం అయ్యేట్టు చెప్పు పెద్దయ్యా?"

"ఇందులో అంత చిదంబర రహస్యం ఏమీలేదురా వెంకటేశ్వర్రావ్! తనే వండుకుంటున్నాడు, సాయంత్రం చదువుకుంటున్నాడు అన్నావు. ప్రతీ సందూ గొందూ తెలుసుకుని ఆటోని జాగర్తగా మానేజ్ చేశాడంటున్నావు. వెళ్ళి రెండు నెలలే అవుతుంది. సాయంత్రాలు అంత బుద్ధిగా ఇంటిపట్టునే చదువుకుంటూ ఉంటే ఈ సందులు, గొందులు, షార్ట్‌కట్‌లు ఎలా తెలిశాయంటావ్?" అన్నాడు పెద్దయ్య వర్మగర్భంగా.

"అంటే!?" అన్నాడు వెంకటేశ్వర్రావ్...



ఈసారి కాస్త తీక్షణంగా.

"ఏంలేదు... గోపాలకృష్ణ అని పేరు పెట్టావుగా అది సార్థకం చేసుకుంటున్నాడేమో ఆలోచించు..."

కళ్ళముందు మందుపాతర పేలినట్టు అదిరిపడ్డాడు వెంకటేశ్వర్రావ్.

"నీ మీద ఈర్ష్యతోనో ఏదోవిధంగా పెద్దరికం నిలుపుకోవాలనో చెప్పటం లేదిలా! కొంచెం ఆలోచించి మనవాళ్ళని మనం అప్పుడప్పుడు చెక్ చేసుకుంటూ ఉండాలి. నా అనుమానం నిజం కాదు అంటే నీ అంత అదృష్టవంతుడింకోడు ఉండడు. నాకన్నా ఆనందించేవాడు కూడా ఉండడు" అన్నాడు పెద్దయ్య ఆర్ద్రత నిండినగొంతుతో.

కళ్ళలో రక్తం సుడులు తిరుగుతున్నట్టనిపించింది వెంకటేశ్వర్రావుకి. రాత్రికి రాత్రే టెలిగ్రాం ఇచ్చాడు గోపాలకృష్ణకి... మీ అమ్మకి సీరియస్‌గా ఉంది రమ్మంటూ...

టెలిగ్రాం అందగానే ఆఘమేఘాల మీద వాలేడు గోపాలకృష్ణ. గుండుపిక్కలా ఉన్న తల్లిని చూసి ఆశ్చర్యపోయేటంతలోనే భుజం మీద చెయ్యివేసి గట్టిగా నొక్కేసి అన్నాడు తండ్రి... 'బైటికెళ్ళి మాట్లాడుదాం పద' అని.

ఊరు చివర కాలవ దగ్గర కూచున్నారు వెంకటేశ్వర్రావ్, గోపాలకృష్ణ. ఓ అయిదు నిముషాల తర్వాత చేరాడు పెద్దయ్య. ఏలాగోలాగ గొంతు పెగల్చుకొని మనసులో మాట బైట పెట్టాడు.

"నిజం చెప్పరా... ఒకవేళ నువ్వు నిజంగా కాస్త చిల్లర తిరుగుళ్ళు తిరిగినా నేనేం అనుకోను. నీకు ఉద్యోగం వచ్చిన వెంటనే పెళ్ళి చెయ్యకుండా పంపడం నాదే తప్పు అని అనుకుంటాను. మీ అమ్మ మీద ఒట్టేసి చెప్తున్నాను. తప్పు నీది మాత్రమే అని అనుకునేటంత కుసంస్కారిని కాను. నాక్కావలసింది నా కొడుకు శీలవంతుడు కావడం అంతే... నువ్వు కూడా మీ అమ్మ మీద ఒట్టేసి చెప్పు" అన్నాడు వెంకటేశ్వర్రావ్.

"అమ్మ మీద ఒట్టేసి చెప్తున్నా నాన్నా... నేను మాటికి మారుపాళ్ళు శీలవంతుణ్ణే" అన్నాడు గోపాలకృష్ణ ధృఢంగా.

"మరి పెద్దయ్య మావ సందేహం...?"

ఓసారి కళ్ళొత్తి దించుకున్నాడు గోపాలకృష్ణ. "ఏం చెప్పమంటావు నాన్నా? పెద్దయ్య మావ అలా సందేహ పడడంలోను, నీతో అనడంతోనూ నిఖార్సయిన నిజాయితీ ఉంది. కానీ మీరందరూ ప్రస్తుతం మన రాష్ట్రంలో ఉన్న పరిస్థితుల గురించి మర్చిపోతున్నారు.

లాస్ట్ టైమ్ సి.యం. మారినప్పుడేమయింది...? కత్తిపోట్లు... కర్ఫ్యూలు... హైదరాబాద్‌లో! అకస్మాత్తుగా కర్ఫ్యూ డిక్లేర్ చేసి ఒక్క గంట కూడా ఇంటికి చేరే టైమ్ ఇవ్వకుండా దొరికినవాణ్ణి దొరికినట్టుగా చితక్కొట్టేరట పోలీసులు. ఓ వైపు పోలీసుల లాఠీ దెబ్బలు, మరో వైపు గూండాల కత్తిపోట్ల భయం. చాలామంది ఉద్యోగులు దొరికిన సందు గొందుల వెంట పరుగులు తీశేవారట, నా కొలీగ్స్ చెప్పారు.

ఎప్పుడు ఏ సి.యం. మారతాడో చెప్పలేం. రాజకీయ నాయకులు ఎప్పుడు ఏ ట్రిక్కులు ప్రజల మీద ఉపయోగించి కల్లోలం సృష్టిస్తారో అంతకన్నా చెప్పలేం. అంచేత హైదరాబాద్‌లో ఉన్న సందులు, గొందులూ తెలుసుకో. పారిపోయి తలదాచుకోడానికి పనికొస్తుంది' అని నా కొలీగ్స్ సలహా ఇచ్చారు.

వాళ్ళ సలహాల ననుసరించి, మీరు సైకిల్ పంపేక ఓ ఆదివారం మొత్తం తిరిగి హైదరాబాద్‌లో సందుగొందులన్నీ తెలుసుకున్నాను. ఇప్పుడు నన్నెక్కడ వదిలిపెట్టినా అతివేగంగా ఇంటికి చేరుకోగలను. కానీ ఆ నాలెడ్జి మీలో ఇలా అపార్థాలు రేపుతుందనుకోలేదు నాన్నా!" అని ముగించాడు— పెద్దయ్య నోరు వెళ్ళ పెడుతుండగా.

## మీకు తెలుసా

★ భారతదేశంలోకెల్లా అతిపెద్ద బాక్సైట్‌గని ఆంధ్రప్రదేశ్‌లోనే వుంది.

★ 'ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీతల్లి భూమి భారతిని' అంటూ ఎలుగెత్తి చాటింది రాయప్రోలు సుబ్బారావు.

★ సాంబ్రాణి ధూపం... శక్తివంతమైన క్రిమి నాశని... పసి పిల్లలున్న ఇంట్లో దీన్ని ఉపయోగించటం... ఎంతో ఉపయోగకరం, ఆరోగ్యదాయకం.

★ యునెస్కో ఎడ్యుకేషన్ అవార్డుకు మదర్ థెరిస్సాను ఎన్నిక చేయబడ్డారు.

★ గల్ఫ్ యుద్ధ సమయంలో ఇరాక్ పట్ల సానుభూతి ప్రదర్శించి అమెరికన్ల ఆగ్రహానికి గురైన జోర్డాన్ రాజు హుస్సేన్ ప్రస్తుతం... అమెరికాలో వారు అందించే ఆర్థిక సహాయంతో కుంటుపడి పోయి అస్తవ్యస్తంగా తయారయిన తన దేశ ఆర్థిక పరిస్థితి చక్కదిద్దుకోవటం అంతర్జాతీయ వార్తలలో విశేషమైన వార్త.

★ ఇటీవలే వింబుల్డన్ మహిళ సింగల్స్‌ను చేజిక్కించుకున్న స్టెఫీగ్రాఫ్... ఒలింపిక్స్‌లో కాప్రియాటి చేతిలో ఓటమిని చవి చూడవలసి వచ్చింది. స్టెఫీపై విజయం సాధించి కాప్రియాటి ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది.

★ సార్క్ దేశాల ఏడవ శిఖరాగ్ర సభ... ఈ సంవత్సరం డిసెంబర్ నెల 12 నుండి 14వ తేదీవరకు బంగ్లాదేశ్ రాజధాని అయిన ఢాకా నగరంలో జరుగుతుందని ప్రకటించారు.

★ రాష్ట్రపతి పదవికి జరిగిన ఎన్నికలలో... 64.78 శాతం ఓట్లు పొంది డా: శంకర్‌దయాల్ శర్మ భారతదేశానికి 9వ రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు.

★ 7వ జాతీయ పార్టీలు ఏకమై ఎన్నుకోవటంతో 'హన్నా సుచోకా' పోలెండ్‌కు ప్రధానిగా ఎన్నికయ్యారు. పోలెండ్‌కు ప్రధానిగా ఎన్నికయిన తొలి మహిళా ప్రధాని ఈమే.

★ అడవుల నరికివేతపై తను వేసిన కార్టూన్ ద్వారా తెలుగు కార్టూనిస్టు 'శంకు' (యన్.బి. శంకర్ కుమార్)కు అంతర్జాతీయ ఖ్యాతి లభించింది. అంతర్జాతీయ కార్టూన్ ఫెస్టివల్ లో ఈతని కార్టూన్‌ని ప్రదర్శిస్తున్నారు.

— ముద్దా రమణమూర్తి, అనంతపురం.

## కాలేజీ తమాషాలు

తమాషా సంఘటనలకు పెట్టింది పేరు.

మీరు కాలేజీలో చదువుకునే రోజుల్లో జరిగిన తమాషా సంఘటనలను క్లుప్తంగా అరఠావు సైజుకు మించకుండా రాసి పంపండి. ప్రచురణార్హమైతే ప్రచురిస్తాం. మీ పాస్‌పోర్ట్ సైజు ఫోటో జతపరచడం మర్చిపోకండేం!